
ప్రజాశక్తి
శనివారం 13 జులై 2024
5
విజయనగరం



అందని ఉపాధి బిల్లులు

కూలీల అవస్థలు

ప్రజాశక్తి-గజపతినగరం

మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి పనులు చేసిన కూలీలకు నెల రోజులుగా వేతనాలు చెల్లించకపోవడంతో వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పురిటిపెంట, గంగచోళ్లపెంట, బగ్గాం, లింగాలవలస, తుమ్మికాపల్లి, లోగిశ తదితర గ్రామాల్లో ఉపాధి కూలీలు చెరువు పనులు చేశారు. మే 15వ తేదీ వరకు చేసిన పనులకు ఉపాధి అధికారులు బిల్లులు చెల్లించారు. ఆ తరువాత నేటి వరకు చేపట్టిన పనులకు 40రోజులుగా బిల్లులు బిల్లులు రాలేదు. దీంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే బిల్లులు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

- జెడ్‌పి సమావేశంలో మంత్రులు కొండపల్లి, గుమ్మిడి
- టోల్‌గేట్‌ను తరలించాలి : జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
- సర్వసభ్య సమావేశంలో వివిధ అంశాలపై చర్చ
- స్థాయీ సంఘాల్లో సభ్యులుగా నియమితులైన ఎమ్మెల్యేలు

జిల్లా అభివృద్ధికి

కలిసికట్టుగా కృషి చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-విజయనగరం కోట

పార్టీలకు అతీతంగా జిల్లా అభివృద్ధికి సమన్వయంతో, కలిసికట్టుగా కృషి చేద్దామని రాష్ట్ర గిరిజన, స్త్రీశిశు సంక్షేమ శాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ఎంఎస్ఎంఇ, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన జెడ్‌పి సర్వసభ్య సమావేశం శుక్రవారం జరిగింది. సమావేశంలో వ్యవసాయం, నీటి పారుదల, వైద్యారోగ్యం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. జొన్నాడవద్ద ఏర్పాటు చేసిన టోల్‌గేట్‌ను అక్కడినుంచి వేరే ప్రాంతానికి తరలించాలని తీర్మానం చేశారు.

మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, గుమ్మిడి సంధ్యారాణితోపాటు, పలువురు ఎంఎల్ఎలు, ఎంపిలు తొలిసారిగా హాజరైన ఈ సమావేశంలో ముందుగా జెడ్‌పి ఛైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లా స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దష్టికి తీసుకువెళ్లాలని కోరారు. గతంలోవలే వివిధ నియోజకవర్గాల ఎంఎల్ఎలను ఆయా స్థాయి సంఘాల సభ్యులుగా నియమిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో ప్రాజెక్టులను ముందుకు తీసుకువెళ్లాలని, విమానాశ్రయాన్ని త్వరగా పూర్తి చేయాలని, గిరిజన యూనివర్సిటీ పనులను మొదలు పెట్టాలని కోరారు. మంత్రి కొండపల్లి మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారానికి కలిసికట్టుగా ముందుకు వెళ్దామని అన్నారు.

రైతుల అభీష్టం మేరకు విత్తనాలు సరఫరా చేయాలి

వ్యవసాయశాఖపై జరిగిన చర్చలో మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ, రైతు అభీష్టం మేరకు, వారికి కావాల్సిన విత్తనాలు సరఫరా చేయాలని కోరారు. వరివిత్తనాలు 1121 వల్ల గతంలో రైతులు పలు ఇబ్బందులను ఎదుర్కొన్నారని చెప్పారు. పంట నష్టపరిహారం రైతులకు సక్రమంగా అందలేదని, దీనికి సంబంధించిన వివరాలను ఇవ్వాలని వ్యవసాయశాఖ జెడిలను ఆదేశించారు. నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువులు రాకుండా చూడాలన్నారు. గిరి శిఖర గ్రామాలకు సైతం విత్తనాలు అందేలా చూడాలన్నారు. చిరుధాన్య విత్తనాలను గిరిజనులకు 90శాతం సబ్సిడీపై అందించాలన్నారు. మంత్రి కొండపల్లి మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో ఏయే విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్న పూర్తి సమాచారాన్ని రైతులకు అందించాలని ఆదేశించారు. కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ, ఎరువులు, విత్తన షాపులపై దాడులు చేయిస్తున్నామని చెప్పారు. కురుపాం ఎంఎల్ఎ తోయక జగదీశ్వరి మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాల్లో కూడా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని కోరారు. నెల్లిమర్ల ఎంఎల్ఎ లోకం నాగమాధవి మాట్లాడుతూ, నకిలీ విత్తనాలను అరికట్టాలని సూచించారు. మంత్రి కొండపల్లి మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం ద్వారా పంట కాలువల్లో పిచ్చిమొక్కలు, పూడికను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని ప్రాజెక్టుల పరిస్థితిని నార్త్‌కోస్టల్ సిఇ సుగుణాకరరావు వివరించారు. మొత్తం 11 ప్రాజెక్టుల్లో 129 పనులకు రూ.8.29కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 237 మంది లష్కర్ల నియామకానికి కూడా ప్రతిపాదించినట్లు తెలిపారు. ఎంఎన్‌ఛానల్ ద్వారా సుమారు 700 ఎకరాలకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ, తోటపల్లి కాలువల ద్వారా శివారు భూములకు కూడా సాగునీరు అందించాలని కోరారు. విజయనగరం ఎంఎల్ఎ అదితి విజయలక్ష్మి గజపతిరాజు మాట్లాడుతూ, ప్రతిపాదించిన కొత్త పనుల వివరాలను అందించాలని కోరారు.

ఎంఎల్ఎ నాగమాధవి మాట్లాడుతూ, ఇసుక అక్రమంగా తరలించి చంపావతి నదిని చంపేశారని అన్నారు. లేఅవుట్ల కారణంగా చెరువులకు వెళ్లే కాలువలు మూసుకుపోయాయని చెప్పారు. కలెక్టర్ అంబేద్కర్ స్పందిస్తూ, లేఅవుట్లపై రెవెన్యూ సిబ్బందితో సర్వే చేయించి, అక్రమణలను తొలగించేందుకు కృషి చేస్తామన్నారు. జెడ్‌పి ఛైర్మన్ మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో ఎక్కడా జిల్లాలో కరువు మండలాలు లేవని అన్నారు. నిబంధనల ప్రకారమే ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటిస్తుందని స్పష్టం చేశారు. పార్వతీపురం ఎంఎల్ఎ బోనెల విజయచంద్ర మాట్లాడుతూ, వరహాలగెడ్డ ఆక్రమణలపై అధికారులను నిలదీశారు. జంఝావతి హైలెవెల్ కెనాల్ ఎందుకు ఆగిందని ప్రశ్నించారు. దీనిపై ఛైర్మన్ మాట్లాడుతూ, ఇది అంతర్రాష్ట్ర సమస్య అనీ, రాష్ట్రస్థాయిలో ఇది పరిష్కారం కావాలని సూచించారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల తోటపల్లి, గడిగెడ్డ, చంపావతి నదుల అనుసంధానం జరగలేదని ఎంఎల్ఎ అదితి అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ సభ్యులు ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా సాలూరు నియోజకవర్గానికి చెందిన పలువురు సభ్యులు గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిలాఫలకాలను తొలగించారంటూ మంత్రుల దృష్టికి తీసుకొచ్చారు.

వైద్యారోగ్యశాఖ వాడీవేడిగా చర్చ

వైద్యారోగ్యశాఖపై వాడీవేడిగా చర్చ జరిగింది. సీజనల్ వ్యాధులను అరికట్టడానికి అన్నిరకాల చర్యలూ తీసుకోవాలని మంత్రులిద్దరూ డిఎంహెచ్ఒలను ఆదేశించారు. ముఖ్యంగా మలేరియా, బోధకాలు వ్యాధుల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లా సర్వజన ఆసుపత్రి సమస్యలను ఎంఎల్ఎ అదితి వివరించారు. ఇక్కడ సిబ్బందిని తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. దీనిపై మంత్రి సంధ్యారాణి స్పందిస్తూ, ఎట్టి పరిస్థితిలోనూ వైద్యులను, సిబ్బందిని తగ్గించరాదని ఆదేశించారు. మంత్రి కొండపల్లి మాట్లాడుతూ, ఘోషాలో కూడా సిబ్బందిని తగ్గించే పరిస్థితి ఉందని, దానిని ఆపాలని కోరారు. దీనిపై కలెక్టర్ అంబేద్కర్ మాట్లాడుతూ, జిల్లా సర్వజన ఆసుపత్రి వైద్యకళాశాలగా మార్పు చెందడంతో, ఎన్‌హెచ్ఆర్ఎం పథకంలో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బందిని వేరే ఆసుపత్రులకు తరలించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. అయినప్పటికీ ఇక్కడ డాక్టర్లు, సిబ్బందీ తగ్గకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అరకు ఎంపి డాక్టర్ తనూజారాణి మాట్లాడుతూ, వర్షాకాలంలో గిరిశిఖర గ్రామాల్లో జ్వరాలు విజృంభించే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతల మరణాలను ఆపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధిపై అవగాహన కల్పించాలన్నారు. ఎంఎల్‌సి డాక్టర్ సురేష్‌బాబు మాట్లాడుతూ, పూసపాటిరేగ మండలం కనిమెట్ట గ్రామంలో విజృంభించిన వ్యాధులను ప్రస్తావించారు. మోపాడ ఆసుపత్రిలో ఆక్రమణలను తొలగించాలని ఎంఎల్ఎ లోకం నాగమాధవి కోరగా, వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అంబేద్కర్ ఆదేశించారు. ఈ సందర్భంగా సామాజిక పింఛన్ల పంపిణీపై చర్చ జరిగింది. మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ, కొంతమంది ముత్తైదువలకు కూడా వితంతు పింఛన్లు అందుతున్నాయని చెప్పారు. పింఛన్ల పరిశీలనకు త్వరలో ఒక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.

జెడ్‌పి ఛైర్మన్ మాట్లాడుతూ అర్హులందరికీ పింఛన్లు అందించేలా చూడాలని, అనర్హులను తొలగించాలని సూచించారు. కొంతమంది జెడ్‌పిటిసిల ఫిర్యాదుపై స్పందిస్తూ, ప్రభుత్వ ఆస్తుల విధ్వంసాన్ని ఎట్టిపరిస్థితిలోనూ సహించేది లేదని మంత్రులు సంధ్యారాణి, శ్రీనివాస్ స్పష్టం చేశారు. విఎఒల తొలగింపుపై విచారణ చేయాలని ఆదేశించారు. జొన్నాడవద్ద ఏర్పాటు చేసిన టోల్‌గేట్‌ను అక్కడినుంచి వేరే ప్రాంతానికి తరలించాలని తీర్మానం చేయడంతో సభ ముగిసింది. పలువురు జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు తమ ప్రాంతంలోని సమస్యలను వివరించారు. అంతకుముందు కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలను, మంత్రులను జెడ్‌పి ఛైర్మన్ సన్మానించారు. సమావేశంలో విజయనగరం, పార్వతీపురం జిల్లాల ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, జెడ్‌పి సిఇఒ శ్రీధర్‌రాజా, డిప్యూటీ సిఇఒ కె.రాజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు



జెడ్‌పి ఛైర్మన్‌తో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

జొన్నాడ వద్ద టోల్‌గేట్‌ను రద్దు చేయాలి

ప్రజాప్రతినిధులకు సిపిఎం నాయకుల వినతి

ప్రజలపై భారాలు వేస్తూ జొన్నాడ వద్ద ఏర్పాటు చేసిన టోల్‌ప్లాజాను రద్దు చేయాలని కోరుతూ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులకు సిపిఎం నాయకులు వినతులు అందజేశారు. శుక్రవారం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో టోల్‌ప్లాజాను రద్దు చేస్తున్నట్లు తీర్మానం చేయాలని కోరారు. సమావేశానికి హాజరైన రాష్ట్ర చిన్న మధ్య తరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు, జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాస్‌కు, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడుకు, ఎమ్మెల్యేలు అదితి విజయలక్ష్మి గజపతిరాజుకు, లోకం మాధవికి వినతులు అందజేశారు. ఇప్పటికే జిల్లాలో నాతవలస టోల్‌గేట్‌తో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తాజాగా జొన్నాడవద్ద కొత్తగా నిర్మించిన టోల్‌గేట్ ప్రభావంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇది చాలదన్నట్లు రామవరం, నరవ మధ్య మరో టోల్‌గేటు, పార్వతీపురం వైపు వెళ్లే మార్గంలో మానాపురం వద్ద మరో టోల్‌గేట్ ఏర్పాటు చేయడం అన్యాయమని అన్నారు. జిల్లా నుంచి ప్రజలు ఎటు వెళ్లాలన్నా భారాలు తప్పేలా లేవని అన్నారు. వెంటనే టోల్‌గేట్‌లను రద్దు చేయాలని కోరారు. వినతులు ఇచ్చిన వారిలో సిపిఎం నాయకులు కె.సురేష్, జి.శ్రీనివాస్, ఎ.జగన్మోహన్, బి.సుధారాణి, ఆర్.ఆనంద్, వి.లక్ష్మి, జి.సింహాచలం, హెచ్ హరీష్, తదితరులు ఉన్నారు. టోల్‌గేట్ ఎత్తివేయాలని కోరుతూ లోక్‌సత్తా అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ ఆధ్వర్యాన ప్రజాప్రతినిధులకు వినతులు ఇచ్చారు.

బిటి రోడ్డు తొలగించారు..

మట్టిరోడ్డు వేసి వదిలేశారు

- వర్షం పడితే రోడ్డంతా బురదే
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-భోగాపురం

భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణంలో భాగంగా సుమారు నాలుగైదు గ్రామాలతోపాటు దివీస్ పరిశ్రమకు కార్మికులు వెళ్లే బిటి రహదారిని పూర్తిగా తొలగించారు. కొత్త రహదారికి భూసేకరణ చేసి, మట్టి రోడ్డును వేసి వదిలేశారు. దీంతో ఆ రహదారి మీదుగా ప్రయాణించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడితే చాలు ఈ రహదారి నుంచి వెళ్లేందుకు వీలు కావడం లేదు. దీంతో రావాడ మీదుగా చుట్టూ తిరిగి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇది మండలంలోని సవరవల్లి జాతీయ రహదారి నుంచి జమ్మయ్యపేటకు వెళ్లే రహదారి పరిస్థితి. వివరాల్లోకి వెళ్తే..

మండలంలోని జమ్మయ్యపేట, చినకవులవాడ, పెదకవులవాడ, తూడెం గ్రామాల ప్రజలు భోగాపురం మండల కేంద్రానికి, సవరవల్లి సంతకు రావాలంటే బిటి రహదారి నుంచే వచ్చేవారు. అన్నవరం సమీపంలోని దివీస్ పరిశ్రమకు వెళ్లే కార్మికులు కూడా ఈ రహదారి నుంచే రాకపోకలు చేస్తుంటారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణంలో భాగంగా ఈ రహదారిని తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. తొలగించిన రహదారి ప్రాంతంలో రన్‌వే నిర్మిస్తున్నారు. తొలగించిన రహదారి స్థానంలో విమానాశ్రయ ప్రహరీ చుట్టూ భూసేకరణ చేసి కొత్తగా మట్టితో రహదారిని వేశారు. దీనిపై తారురోడ్డు వేసి ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. రోజులు గడుస్తున్నా ఈ రహదారిపై తారురోడ్డు వేసేందుకు అధికారులు చర్యలు చేపట్టడం లేదు. అసలే వర్షాకాలం కావడంతో వర్షం పడితే చాలు.. ఈ రహదారి మీదుగా రాకపోకలు చేయాలంటే నరకంగా మారుతోంది. దీంతో తూడెం మీదుగా రావాడ రహదారి నుంచి సవరవల్లి జాతీయరహదారికి చేరుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వెంటనే అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టిసారించి తారు రోడ్డు వేసేందుకు కృషి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



గతంలో జమ్మయ్యపేట వెళ్లేందుకు ఉన్న ఈ రహదారి విమానాశ్రయ నిర్మాణంలో తొలగించారు



బురదమయంగా మారిన జమ్మయ్యపేట రహదారి

పథకాల సొమ్ము అందేనా?

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గత వైసిపి ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించి ఎన్నికల ముందు బటన్ నొక్కినా... ఆ సొమ్ము ఇప్పటికీ లబ్ధిదారుల ఖాతాల్లో జమ కాలేదు. ఎన్నికల కమిషన్ మే 13 తర్వాత నగదు జమ చేసుకోవచ్చునని గ్రీన్ సిగ్నల్ ఇచ్చినప్పటికీ సొమ్ము జమ చేయకపోవడం జనాల్లో చర్చనీయాంశంగా మారింది. ఎన్నికలకు రెండు రోజుల ముందు పలు సంక్షేమ పథకాల సొమ్ము జమపై పెద్దఎత్తున రాద్ధాంతం జరగడం, మే 14న సొమ్ము జమకు ఎన్నికల కమిషన్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంపై జనానికి స్పష్టత ఉంది. ఎన్నికలు పూర్తయ్యి రెండు నెలలు గడవడంతో డబ్బుల కోసం లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. మార్చి 16న ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. నోటిఫికేషనుకు ముందు మార్చి రెండో తేదీన విద్యాదీవెన, మార్చి 7న చేయూత, మార్చి 14న ఇబిసి నేస్తం, ఫిబ్రవరి నెలాఖరును కల్యాణమస్తు షాదీ తోఫా పథకాలకు సంబంధించి సిఎం బటన్ నొక్కి సొమ్ము విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. అయితే నేటికీ చాలా మంది లబ్ధిదారుల ఖాతాల్లో సొమ్ము జమకాకపోవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది.

విజయనగరం, మన్యం ఉమ్మడి జిల్లాల్లో దాదాపు రూ.400 కోట్లకు పైగా వివిధపథకాల లబ్ధిదారులకు అందాల్సి ఉంది. జిల్లాలో రైతులకు సబ్సిడీ సొమ్ము అందాల్సిఉంది. 45 ఏళ్లు నిండిన మహిళలకు ఇచ్చే చేయూత పథకం కింద రూ.200 కోట్లు, ఇబిసి నేస్తంకింద అగ్రవర్ణ పేదలకు రూ.15 కోట్లు, విద్యాదీవెన కింద విద్యార్థులకు రూ.20 కోట్లు, కళ్యాణమస్తు, షాదీ తోఫా కింద సుమారుగా కోటిన్నర అందాల్సిఉంది. జిల్లాలో రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, చేయూత కింద రూ.100కోట్లు, ఇబిసి నేస్తం , కళ్యాణమస్తు, షాదీతో డబ్బుకు జమచేయాల్సి ఉంది. ఉమ్మడి జిల్లాల్లో వివిధపథకాలకు సంబంధించి దాదాపు రెండున్నర లక్షలమందికి పైగా లబ్ధిదారులు సంక్షేమ పథకాల డబ్బుల కోసం వేచిచూస్తున్నారు. ఎన్నికల ముందు పథకాలసొమ్ము జమపై హడావుడి చేసి ఇప్పుడుప్రభుత్వం ఇవ్వకుండా తాత్సారం చేస్తుందనే చర్చ జనాల్లో సాగుతోంది. విద్యాదీవెనసొమ్ము సకాలంలో జమ కాకపోవడంతో ఎంతోమంది విద్యార్థుల తల్లిదండ్రులు అప్పు చేసి ముందుగానే కాలేజీలకు ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా వెంటనే లబ్ధిదారులకు నిధులు జమ చేయాలని ప్రజలు కోరుతున్నారు.



నిరసన తెలుపుతున్న చేయూత లబ్ధిదారులు (ఫైల్)

వాయుసేనలో ఉద్యోగాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరం కోట

అగ్నిపథ్ స్కీం ద్వారా అగ్నివీర్-వాయు సేనలో ఉద్యోగాలకు ఆన్ లైన్ ద్వారా పురుష, మహిళ అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సెట్విజ్ సిఇఒ బి.రామగోపాల్ తెలిపారు. భారత వాయుసేనలో అగ్నిపథ్ స్కీం ద్వారా వాయు సేనలో ఉద్యోగాలకు ఇంటర్మీడియట్ / ఇంజినీరింగ్‌లో 3ఏళ్ల డిప్లమా, రెండేళ్ల ఒకేషనల్ కోర్స్ పూర్తి చేసుకున్న అభ్యర్థుల నుండి ఆన్ లైన్ దరఖాస్తులను ఈనెల 8నుంచి 28వరకు https://agnipathvayu.cdac.in వెబ్‌సైట్ ద్వారా స్వీకరిస్తామని తెలిపారు. సైన్స్ విభాగాల ఉద్యోగాలకు ఇంటర్మీడియట్ ఫిజిక్స్, మేథ్మెటిక్స్ ఇంగ్లీష్ 50శాతం ఉత్తీర్ణత (లేదా) మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్, కంప్యూటర్ సైన్స్, ఇన్స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ స్పెసిలిజషన్‌తో 3ఏళ్ల డిప్లమా కోర్స్ 50శాతం ఉత్తీర్ణత (లేదా) రెండేళ్ల ఒకేషనల్ కోర్సులు ఫిజిక్స్, మేథ్మెటిక్స్ 50శాతంఉత్తీర్ణతతో పూర్తి చేసి ఉండాలి. సైన్స్ కాకుండా ఇతర విభాగాల ఉద్యోగాలకు ఇంటర్మీడియట్ 50శాతం ఉత్తీర్ణత (లేదా) 2 ఏళ్ల ఒకేషనల్ కోర్స్‌లో 50శాతం ఉత్తీర్ణత పాసై ఉండాలి. అభ్యర్థుల వయసు 3.7.2004 నుండి 3.1.2008 మధ్య జన్మించి ఉండాలి.

శారీరక దారుఢ్యం 152.5 సెంటి మీటర్లు పురుషులకు, 152 సెంటి మీటర్లు మహిళలకు ఎత్తు కలిగిఉండాలి,గాలి పీలిచినపుడు ఛాతి 5 సెంటి మీటర్ల వ్యాకోచం చెందాలి. దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో రాత పరీక్షలు నిర్వహించి, తదుపరి ఫిజికల్ ఫిట్నెస్ పరీక్షలు నిర్వహించడం ద్వారా ఎంపిక ప్రక్రియ ఉంటుంది. ఎంపికైన వారిని నాలుగేళ్ల షార్ట్ టర్మ్ సర్వీస్ అగ్నివీర్-వాయు సేనలో సర్వీస్ లోకి తీసుకుంటారని తెలిపారు.

పిడుగు పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-డెంకాడ

మండలంలోని అక్కివరం గ్రామంలో పిడుగు పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అక్కివరం గ్రామానికి చెందిన కంది సోమగారి సూర్యనారాయణ (54) తన పశువులను మేత కోసం పొలానికి తోలుకెళ్లాడు. సాయంత్రం ఇంటికి పశువులను తోలుకు వస్తున్న సమయంలో ఉరుములు, ఈదురుగాలులతో వర్షం వచ్చింది. అదే సమయంలో పిడుగు పడి అక్కడికక్కడే సూర్యనారాయణ మృతి చెందాడు. స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. వారు వచ్చి సపర్యాలు చేసినా ఫలితం దక్కలేదు. సూర్యనారాయణకు భార్యతోపాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. డెంకాడ పోలీసులు కేసు నమోదు చేశారు.

మొండి బకాయిల వసూళ్లలో పురోగతి

కమిషనర్ ఎం.ఎం.నాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ ఎం.ఎం.నాయుడు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నీటి పన్ను మొండి బకాయిలు వసూళ్ళలో పురోగతి కనబర్చడం అభినంద నీయమని నగరపాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు అన్నారు. శుక్రవారం కార్యాలయంలో ఎమినిటీస్, అడ్మిన్ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతవారం నీటి పన్ను మొండి బకాయిలు వసూలే లక్ష్యంగా సచివాలయాల వారీగా కార్యదర్శులకు లక్ష్యాలను నిర్దేశించారు. ఆ మేరకు కార్యదర్శులు బకాయిల వసూళ్లకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించారు. దీంతో ఆశించిన దానికన్నా ఎక్కువ మేర మొండి బకాయిలు వసూలైంది. ఈ సందర్భంగా కమిషనర్ ఎంఎం నాయుడు మాట్లాడుతూ నీటి పన్ను వసూలను వేగవంతం చేయాలని ఆదేశించిన మీదట అడ్మిన్ ఎమినిటీస్ కార్యదర్శులు ప్రణాళికాబద్ధంగా నీటి పన్ను వసూళ్ళను ముమ్మరం చేశారన్నారు. ఇదే ఒరవడితో సచివాలయాల వారీగా నీటి పన్ను వసూళ్ళను మరింత వేగివంతం చేయాలన్నారు. 2024 - 25 ఆర్థిక సంవత్సరానికి గానూ రూ.6కోట్ల 18లక్షల 19వేల 841 లక్ష్యం కాగా, ఏప్రిల్ నుండి ఇప్పటి వరకు రూ.60,46,854 వసూలైందని తెలిపారు. ఈనెల 5వ తేదీ నుండి 12వ తేదీ వరకు కేవలం వారం రోజుల్లో రూ.16,61,030 నీటి పన్ను వసూలు చేశారని తెలిపారు. నీటిపన్ను మొండి బకాయిలను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. నీటి నిర్వహణకు అధిక మొత్తంలో వ్యయం అవుతుందని, సక్రమ నీటి నిర్వహణకు పన్నులు వసూలు అనివార్యమని అన్నారు. సకాలంలో నీటి పన్ను చెల్లించని ఎడల కుళాయి కనెక్షన్లను తొలగిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు, ఇఇ కె.శ్రీనివాసరావు, డిఇ అప్పారావు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులకు అశోక్ దిశానిర్దేశం

విజయనగరంకోట : జిల్లా పరిషత్ సమావేశానికి హాజరయ్యేముందు టిడిపి ఎంపి, ఎమ్మెల్యేలు, మంత్రులకు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు, కేంద్ర మాజీమంత్రి పి.అశోక్‌గజపతిరాజు దిశా నిర్దేశం చేశారు. పార్టీ కార్యాలయం అశోక్‌బంగ్లాలో వారితో సమావేశమయ్యారు. జెడ్‌పి సమావేశంలో ఏవిధంగా వ్యవహరించాలి, ఏవిధంగా మాట్లాడాలనే అంశాలపై సలహాలు సూచనలు ఇచ్చారు. సమావేశంలో పార్లమెంట్ పార్టీ అధ్యక్షులు కిమిడి నాగార్జున, రాష్ట్ర మంత్రులు గుమ్మిడి సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్ , పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు , లోకం మాధవి , బోనెల విజయచంద్ర, తోయక జగదీశ్వరి పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలి

విజయనగరం కోట : ఉద్యోగ విరమణ వయసు 62ఏళ్లకు పెంచాలనికోరుతూ ఆంధ్ర ప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు వయోవృద్ధుల కార్పొరేషన్ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రధానకార్యదర్శి ఎస్.ఈశ్వరరావు తెలిపారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌రావుకు వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి ఇతర కార్పొరేషన్ ఉద్యోగులతో సమానంగా 62ఏళ్లకు ఉద్యోగ విరమణ వయసు పెంచాలని కోరారు.



మాట్లాడుతున్న ఆర్‌జెడి విజయభాస్కర్

విద్యా రంగంలో..

ప్రత్యేక బోధన పద్ధతులు

ఆర్‌జెడి విజయ భాస్కర్

ప్రజాశక్తి - భోగాపురం

విద్యావ్యవస్థలో ప్రత్యేక బోధన పద్ధతులను ఉపయోగించి వెనుకబడిన విద్యార్థులపై దృష్టి పెట్టాలని ఆర్‌జెడి పి.విజయ భాస్కర్ అన్నారు. భోగాపురంలోని మోడల్ పాఠశాలలో మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులతో శుక్రవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా వ్యవస్థ బలోపేతానికి ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని అన్నారు. పాఠ్యాంశాలను కథలు, ఉదాహరణలతో విద్యార్థులకు ఆకట్టుకునే విధంగా బోధనోపకరణాల ద్వారా బోధించాలని అన్నారు. పాఠాలు చెప్పేటప్పుడు సంబంధిత పాఠ్యాంశంపై ముందస్తు తర్ఫీదు పొందిన తర్వాతే విద్యార్థులకు బోధించాలని అన్నారు. సమయపాలన, క్రమశిక్షణను అలవర్చుకోవాలని సూచించారు. అంతకుముందు ఆయన భోగాపురం, ముంజేరు పాఠశాలలను పరిశీలించారు. సమావేశంలో జిల్లా ఉప విద్యాశాఖ అధికారి కెవి రమణ, మండల విద్యాశాఖ అధికారులు ఎం.రమణమూర్తి, బి.చంద్రమౌళి, ప్రిన్సిపాల్ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

14న మడ్డువలస నీరు విడుదల

ప్రజాశక్తి-వంగర

మండలంలోని మడ్డువలస ప్రాజెక్టు దిగువ ఆయకట్టుకు కుడి కాలువ ద్వారా ఈ నెల 14న ఉదయం 10 గంటలకు సాగునీరు విడుదల చేస్తామని ప్రాజెక్టు ఎఇ కె.నితిన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫేజ్-1లో వంగర మండలంలో 996 ఎకరాలకు, రేగిడి ఆమదాలవలసలో 6777, సంతకవిటిలో 10976, జి.సిగడాంలో 6029, పొందూరు మండలంలో 99 ఎకరాలకు.. మొత్తం 24,877 ఎకరాలకు నీరందిస్తామని తెలిపారు. ఫేజ్-2లో లావేరు మండలంలో 5200 ఎకరాలకు సాగునీరు అందిస్తామని చెప్పారు. మొదటిరోజు 100 క్యూసెక్కుల నీటిని దిగువకు విడిచిపెడతామని, రైతులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

పార్కు కార్మికుల తొలగింపు అన్యాయం

ప్రజాశక్తి-బొబ్బిలి

పార్కు కార్మికుల తొలగింపు అన్యాయమని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, నాయకులు టివి రమణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్కు కార్మికుల పేరుతో మున్సిపల్ సాధారణ నిధుల నుంచి ఏడాదికి రూ.36 లక్షలు డ్రా చేసి, కార్మికులకు వేతనాలు రూ.10 లక్షల వరకు చెల్లించి, మిగతా రూ.26 లక్షలు స్వాహా చేసినట్టు ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు. పార్కు కార్మికులకు కేటాయించిన నిధులలో అక్రమాలు జరగడంతో ఆడిట్ అధికారులు అభ్యంతరం చెప్పారని గుర్తుచేశారు. ఆడిట్ పూర్తయ్యే వరకు పార్కు కార్మికులను ఆపాలని ఆడిట్ అధికారులు చెప్పడంతో అన్యాయంగా పార్కు కార్మికులను తొలగించారని చెప్పారు. పార్కు కార్మికులకు న్యాయం చేయాలని, నిధుల స్వాహాపై సమగ్ర దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



వర్షంతో పొలాల్లో చేరిన నీరు

దంచికొట్టిన వర్షం

ప్రజాశక్తి-భోగాపురం

జిల్లాలోని భోగాపురం, డెంకాడ మండలాల్లో శుక్రవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రతతో ఇబ్బంది పడిన ప్రజలకు ఊరట కలిగించింది. మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. నల్లని మబ్బులు ఆకాశాన్ని కమ్ముకున్నాయి. నల్లని మబ్బులు కమ్ముకోవడంతో ప్రజలు ఉక్కపోత నుంచి ఉపశమనం పొందారు. భోగాపురం మండలంలోని పలు గ్రామాల్లో వర్షం దంచి కొట్టింది. దీంతో చెరువుల్లోనూ పొలాల్లోనూ నీరు చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

15న సమస్యలపై వినతుల స్వీకరణ

ప్రజాశక్తి-రేగిడి

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఈ నెల 15న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదులు చేసుకోవాలని ఎంపిడిఒ శ్యామల కుమారి, తహశీల్దార్ రాములమ్మ ఒక ప్రకటనలో ప్రజలను కోరారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండల స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటల నుండి 1.30 వరకు జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పంచాయతీ రాజ్, రెవెన్యూ, ఆర్‌డబ్ల్యుఎస్, హౌసింగ్ ఇతర శాఖల సమస్యల పరిష్కారానికి వినతులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు.

ట్రిపుల్ ఐటికి బొప్పడాం విద్యార్థులు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

ట్రిపుల్ ఐటికి బొప్పడాం హైస్కూల్ విద్యార్థులు నలుగురు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఎం.నగేష్ కుమార్ తెలిపారు. ఎంపికైన సిహెచ్.దుర్గా దీక్షిత, ఎం.చంద్రకేశ్వరి, సిహెచ్.అభిమన్యు, జె.యోగేశ్వరరావును హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

పన్నుల వసూళ్లు వేగవంతం

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపాలిటీలో ఆస్తిపన్ను, ఖాళీ స్థలాల పన్ను, కుళాయి పన్ను వసూళ్లు వేగవంతం చేయాలని కమిషనర్ ఎల్.రామలక్ష్మి సిబ్బందిని ఆదేశించారు. పన్ను వసూళ్లపై సచివాలయ ఉద్యోగులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బకాయి పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలన్నారు. ప్రతి వారం పన్నుల వసూళ్లపై సమీక్ష నిర్వహిస్తామని, అందులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. షాపింగ్ కాంప్లెక్స్ అద్దెలు వసూలు చేయాలన్నారు. సమావేశంలో ఆర్ఒ ప్రసాద్, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని ఒంటితాటి అగ్రహారం 33/11 కెవి సబ్ స్టేషన్‌లో శనివారం కొత్త ట్రాన్స్‌ఫారం పనులు ఉన్నందున ఉదయం 9గంటల నుంచి 10.30 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఇఇ పి.హరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రదీప్ నగర్, సిబి కాలనీ, అలకానంద కాలనీ, బొగ్గులదిబ్బ, ఎల్‌బి కాలనీ, షాలిమార్‌హోటల్ , వివేకానంద కాలనీ తదితర ప్రాంతాలకు సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు

ప్రజాశక్తి-రామభద్రపురం

అనుమతులు లేకుండా ఇసుక, కంకర రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని తహశీల్దార్ సులోచనారాణి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. వాల్టా చట్టం మేరకు మైన్స్, రెవెన్యూ అధికారుల అనుమతులు లేకుండా ఏ ఒక్కరూ వీటిని తీసుకు వెళ్లరాదన్నారు. ఇప్పటికే ప్రయివేటు స్థలాలకు మట్టి తీసుకువెళుతున్నట్టు ఫిర్యాదులు అందుతున్నాయని, వీటిపై నిఘా ఏర్పాటు చేశామని చెప్పారు. ఎవరైనా తరలిస్తే వాహనాలను సీజ్ చేయడమే కాకుండా మట్టి తోలిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దీనిపై ఇప్పటికే గ్రామాల్లో అవగాహన కల్పించాలని విఆర్ఒ, విఆర్ఎలకు సూచనలు ఇచ్చామన్నారు.

పాఠశాలకు విరాళం

ప్రజాశక్తి-జామి

జామి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు మండలంలోని రామభద్రపురం అగ్రహారంలోని శ్రీఉమా వీరేశ్వరస్వామి ఆశ్రమాధిపతి సాయినాన్న రూ.25 వేలు విరాళం అందజేశారు. పాఠశాల అభివృద్ధి కోసం శుక్రవారం ఎంఇఒ గంగరాజు సమక్షంలో జామి హైస్కూల్ హెచ్‌ఎం అబ్దుల్ రెహమాన్‌కు నగదును అందజేశారు. ఈ సందర్భంగా సాయినాన్న మాట్లాడుతూ తమ గురువు శ్రీరామనందస్వామి జన్మదినాన్ని పురస్కరించుకుని విరాళం అందించినట్లు తెలిపారు. ఆశ్రమం తరుపున ఈ నెల 8న లక్కవరపుకోట మండలంలోని కొట్యాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.25 వేల నగదును అందజేశారు. జామి మండలంలోని జెడివలనలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తువ్వాళ్లను అందజేసినట్లు సాయినాన్న తెలిపారు. కార్యక్రమంలో ఆశ్రమం తరుపున నార్లమహంతి నారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు ఆళ్ల రాము తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేటలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని జగ్గయ్యపేట గ్రామంలో శుక్రవారం పారిశుధ్య పనులు చేపట్టారు. ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ఉన్న కాలువలో పేరుకుపోయిన పిచ్చిమొక్కలు, పూడికను తొలగించారు. ఈ పనులను సర్పంచ్ వి.రాములమ్మ, ఉప సర్పంచ్ వి.శ్రీను. పంచాయతీ కార్యదర్శి రవి పర్యవేక్షించారు.

పారదర్శకంగా రైతులకు సేవలు

ఎమ్మెల్యే బేబినాయన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బేబినాయన

ప్రజాశక్తి-రామభద్రపురం

రైతన్నలకు పారదర్శకంగా సేవలు అందించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన తెలిపారు. శుక్రవారం స్థానిక రైతుసేవా కేంద్రంలో రాయితీ ఎరువులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించే పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని, సేంద్రియ పద్ధతులు అవలంబించి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. రసాయన ఎరువులు వాడకం తగ్గించి, నూతన వ్యవసాయ విధానాలు అలవాటు చేసుకోవాలని కోరారు. గత ప్రభుత్వం రైతన్నలకు చాలా ఇబ్బందులు కల్పించి మద్దతుధర ఇవ్వకుండా, పండించిన పంటలు సకాలంలో అమ్ముకొనే పరిస్థితులు కల్పించక వేధించిందని విమర్శించారు. ఈ ఏడాది తమ ప్రభుత్వం అలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులతో సకాలంలో పంటలు అమ్ముకొనేలా మద్దతుధర కల్పిస్తామని హామీఇచ్చారు. ఈ ప్రాంత రైతులు ఉద్యాన, కూరగాయల పంటల సాగుకు ప్రాధాన్యత ఇచ్చి మేలైన సేంద్రీయ పద్ధతుల్లో వాటిని పండించేలా వ్యవసాయ శాఖ శిక్షణ ఇవ్వాలని సూచించారు. సమావేశంలో తహశీల్దార్ సులోచనారాణి, ఎంపిడిఒ ఈశ్వరమ్మ, ఎఒ వెంకటయ్య, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చింతల రామకృష్ణ, సర్పంచ్ రవ్వ ఈశ్వరరావు, ఎఎఒ కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలసలోనే గిరిజన యూనివర్సిటీ!

సిఎం సంకేతాలిచ్చారన్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-కొత్తవలస

కొత్తవలసలో గిరిజన యూనివర్సిటీ నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంకేతాలిచ్చారని, ఇది ఈ ప్రాంత అభివృద్ధికి శుభ పరిణామమని టిడిపి నాయకులు అభిప్రాయపడ్డారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో విలేకరులతో టిడిపి మండల అధ్యక్షులు గొరపల్లి రాము, మాజీ జెడ్‌పిటిసి కోళ్ల శ్రీను, సీనియర్ నాయకులు తిక్కాన చినదేవుడు మాట్లాడారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో మండలంలోని రెల్లి రెవెన్యూ పరిధిలో గిరిజన యూనివర్సిటీకి శంకుస్థాపన చేసి, రూ.5 కోట్లతో ప్రహరీ నిర్మాణం పూర్తిచేశామని తెలిపారు. తరువాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం గిరిజన యూనివర్సిటీని సాలూరు నియోజకవర్గ పరిధిలోకి మార్చిందని, ఆ నిర్మాణం ఆదిలోనే ఆగిపోయిందని తెలిపారు. ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తిరిగి గిరిజన యూనివర్సిటీని కొత్తవలసలోనే నిర్మిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించడం హర్షనీయమన్నారు. కొత్తవలసలో గిరిజన యూనివర్సిటీతో పాటు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు, నియోజకవర్గాన్ని విశాఖపట్నం జిల్లాలో కలపడం కోసం టిడిపి పాటు పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో కొత్తవలస మాజీ సర్పంచ్ కొరుపోలు అప్పారావు, పొట్నూరి రత్నాజీ, జి.దుర్గా ఉమేష్, లెంక శ్రీను, మిడతాన కాశీ విశ్వనాథరావు, కర్రి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులపై అవగాహన

ప్రజాశక్తి-బొండపల్లి



మాట్లాడుతున్న ఎంపిడిఒ హరిహరరావు

పని ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడే వారిపై చట్ట ప్రకారంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎంపిడిఒ ఎస్.హరిహరరావు అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం పని ప్రదేశాలలో లైంగిక వేధింపులు చట్టం – 2013పై వివిధ శాఖల సిబ్బందికి అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ మహిళల పని ప్రదేశాలులో లైంగిక వేధింపులు ఎక్కువయ్యాయని చెప్పారు. ఈ నేపథ్యంలో చట్టం తప్పక అమలు చేయాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. తహశీల్దార్ హనుమంతురావు, ఐసిడిఎస్ పిఒ ఉమా భారతి మాట్లాడుతూ కార్యాలయాలలో గాని, సంస్థలలో గాని పనిచేస్తున్న మహిళలను రక్షించేందుకు కమిటీలు వేయాలన్నారు. గ్రామస్థాయిలో కూడా ఐదుగురు సభ్యులతో లైంగిక వేధింపుల నిరోధక కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి సిహెచ్.సుగుణాకర్ రావు, ఎపిఎం సులోచనా దేవి, ఎపిఒ కృష్ణవేణి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు జానకి, కృష్ణవేణి, ఝాన్సీ , ప్రమీలా దేవి పాల్గొన్నారు.

మలేరియాపై అవగాహన ర్యాలీ



గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని ఓబులయ్యపాలెంలో బొద్దాం పిహెచ్‌సి ఆధ్వర్యాన శుక్రవారం మలేరియా నిర్మూలనపై అవగాహన ర్యాలీ చేపట్టారు. గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ఈ శిబిరంలో ఏడుగురికి పరీక్షలు చేసి, మందులు అందజేశారు. అనంతరం డాక్టర్ రమాదేవి మాట్లాడుతూ గ్రామంలో ప్రతిఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్, గ్రామ సర్పంచ్ డి.లక్ష్మి, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కె.రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

బిసి డిక్లరేషన్‌ను అమలు చేయాలి

బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు కెల్ల శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బిసి డిక్లరేషన్‌ను అమలు చేయాలని బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కెల్ల శ్రీనివాసరావు కోరారు. శుకవారం బిసి సంక్షేమ సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం లో అయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బిసి డిక్లరేషన్ లో బిసి భద్రతా చట్టాన్ని అమలు చేయాలన్నారు. జిల్లాలో బిసి భవన్ నిర్మాణానికి జిల్లా కు చెందిన రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యే లు అధికారులు కృషి చేయాలన్నారు. ఇటీవల జరిగిన శాసన సభ ఎన్నికల్లో బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశవ శంకర రావు ఆదేశాల మేరకు కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేశామన్నారు. బిసిల సంక్షేమనికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు.

ఈ నెల 15న తమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశవ శంకరరావు పుట్టినరోజు వేడుకలను అన్ని మండలాల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. సమావేశంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గొర్లె సూరిబాబు, జిల్లా ఉపాధ్యక్షులు తోటపల్లి బుజ్జిబాబు, జిల్లా యూత్ అధ్యక్షులు బొబ్బాది చంద్రనాయుడు, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి సన్యాసిరావు పాల్గొన్నారు.

సంఘాల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-గంట్యాడ

ప్రతి గ్రామంలో సంఘాల అభివృద్ధికి కృషి చేయాలని ఏరియా కోఆర్డినేటర్ ఎన్.ఆదయ్య అన్నారు. మండల సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం మండల అధ్యక్షులు కె.సీతమ్మ అధ్యక్షతన జరిగిన మహిళా సమాఖ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. స్త్రీ నిధి, ఉన్నతి, సిఐఎఫ్ అంతర్గత రుణాల లక్ష్యాల గురించి వివరించారు. గ్రామ సంఘాలు సుస్థిరత సాధించడానికి అవసరమైన ప్రణాళికను తయారు చేయడంపై తెలియజేశారు. డిఎంఎల్‌టి సోమనాయుడు మాట్లాడుతూ సీడ్ బాల్ తయారీ, విత్తన శుద్ధిపై తెలిపారు. కార్యక్రమంలో ఎపిఎం శ్రీనివాస్, ఎఫ్‌పిఒ ఎపిఎం శైలేష్, సిసిలు చిన్నబాబు, ముత్యాల నాయుడు, అచ్చెంనాయుడు, గౌరీశ్వరి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి అరుణశ్రీ

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన శిక్షలు

ప్రజాశక్తి-బొబ్బిలి

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన శిక్షలు ఉంటాయని సీనియర్ సివిల్ జడ్జి ఎస్.అరుణశ్రీ హెచ్చరించారు. స్థానిక కోర్టులో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. లైసెన్స్, బీమా లేకుండా వాహనాలను నడిపితే కఠిన చర్యలు తప్పవన్నారు. నూతన చట్టాలు అమల్లో ఉన్నాయని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఇఒ బాలభాస్కరరావు

మధ్యాహ్న భోజనం పరిశీలన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని కరకవలస ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ పి.బాలభాస్కరరావు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులు పరిశీలించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పరీక్షించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించి, పనితీరుపై సంతృప్తి వ్యక్తంచేశారు. ఈ పరిశీలనలో సిఆర్‌పిలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

దశపర్ణి కషాయం తయారీపై అవగాహన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని కుమ్మపల్లి గ్రామంలో దశపర్ణి కషాయం తయారీపై జెడ్‌బిఎన్‌ఎఫ్ సిబ్బంది రైతులకు అవగాహన కల్పించారు. ఖరీఫ్ సీజన్‌లో వరి పంటకు ముందుగా ప్రతి గ్రామాల్లో దశపర్ణి కషాయం, పలుపత్ర కషాయం తయారు చేయాలని మాస్టర్ ట్రైనర్ సన్యాసమ్మ తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌బిఎన్‌ఎఫ్ సిబ్బంది సన్యాసమ్మ, నారాయణమ్మ, ఈశ్వర్రావు, తదితరులు పాల్గొన్నారు.

మారికకు రోడ్డు వేయరా..?

ప్రజాశక్తి - వేపాడ



రోడ్డు మంజూరైనట్లు ఏర్పాటు చేసిన బోర్డు

మండలంలోని కరకవలస పంచాయతీ పరిధిలో గల మారిక గిరిజన గ్రామం కరకవలసకు 8.60 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ గ్రామం మారిక కొండలు మధ్యలో ఉంది. ఈ గ్రామంలో సుమారు 250 మంది కుటుంబాలు నివసిస్తున్నాయి. నేటికి సుమారు 15 సంవత్సరాలు కావస్తున్నప్పటికీ రోడ్డు నిర్మాణం పనులు మాత్రం పూర్తి కాలేదు. ఇతర జిల్లాల నుంచి వచ్చి ఇక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేసుకునే వారు మాత్రం ఇష్టానుసారంగా లే అవుట్లకు రోడ్డు వేసుకుంటున్నారు. ఇందులో భాగంగానే ఆ గ్రామానికి అవసరమైన రెండు కిలోమీటర్ల మేర రోడ్డును కూడా వారే వేశారు. ఈ రోడ్డుకు ఇరువైపులా ఉన్న భూముల ధరలను పెంచుకోవడానికే తారు రోడ్డు వేశారు తప్పితే గిరిజన ప్రజలు కోసం మాత్రం కాదన్న విషయం ఇప్పటికే తేటతెల్లమైంది.

అక్కడ నుంచి మిగితా 6.6 కిలోమీటర్ల రోడ్డు పూర్తి చేయాలని సిపిఎం నాయకులు, గిరిజనలు పలుమార్లు ధర్నాలు చేపట్టినా ఫలితం లేకుండా పోయింది. ధర్నాలు, నిరసనలు తెలిపినపుడు, ఎన్నికల సమయంలో మాత్రం రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు హామీలిస్తున్నా తరువాత వాటిని తుంగలో తొక్కేస్తున్నారు. కాగా ఇటీవల రియల్ ఎస్టేట్ వ్యాపారులు వేసిన రోడ్డు కూడా బీటలు వారడం, గండి పడటంతో ప్రమాదకరంగా మారింది. ఇప్పటికైనా అధికారులు, కొత్త ప్రభుత్వం స్పందించి మారిక గిరిజనుల బాధలను గుర్తించి పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మాణం చేపడతారని గిరిజనులు ఆశగా ఎదరుచూస్తున్నారు.

ఎస్‌పికి పోలీసు అధికారుల అభినందనలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లా ఎస్‌పిగా బాధ్యతలు చేపట్టి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం పలువురు పోలీసు అధికారులు అభినందనలు తెలిపారు. అదనపు ఎస్‌పి అస్మా ఫర్హీన్ ఆధ్వర్యంలో పలువురు పోలీసు అధికారులు, జిల్లా పోలీసు కార్యాలయ ఉద్యోగులు పుష్ప గుచ్చాలు ఇచ్చి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌పి కేక్ కట్ చేశారు. జిల్లా ప్రజలు, వివిధ హోదాల్లో, వివిధ పోలీసు స్టేషన్లలో పని చేస్తున్న సమర్థవంతమైన పోలీసు అధికారులు, సిబ్బంది సమిష్టి సహకారంతో జిల్లాలో సమర్థవంతంగా పని చేశానని తెలిపారు. కార్యక్రమంలో డిఎస్‌పిలు ఆర్.గోవిందరావు, ఎవిఎస్ చక్రవర్తి, సిఐలు కెకెవి విజయనాథ్, ఇ.నరసింహ మూర్తి, బి వెంకటరావు, కె.రామారావు, జి. మురళి, జి.రాంబాబు, ఎస్‌ఐలు అశోక్ కుమార్, ఆర్.వాసుదేవ్, గణేష్, ప్రభావతి తదితరులు ఎస్‌పికి పుష్పగుచ్చాలు అందజేసి అభినందించారు.



కేకు కట్ చేస్తున్న ఎస్‌పి దీపిక

14న ప్రతిభా పురస్కారాలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 14న సాయంత్రం 6గంటలకు జ్ఞాన సరస్వతి ఆలయం ప్రాంగణంలో ప్రతిభా పురస్కారం నిర్వహిస్తున్నట్లు సమాఖ్య గౌరవాధ్యక్షులు డాక్టర్ డివి శ్రీకాంత్ తెలిపారు. శుక్రవారం గాయత్రీ భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆ రోజు జరిగే సభకు ముఖ్య అతిథిగా సీతం కళాశాల ప్రిన్సిపాల్ ద్వివేదుల రామమూర్తి, కోర్బా కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.నాగమణి, ఆత్మీయ అతిథిగా ప్రముఖ ఆడిటర్ ఇఆర్ సోమయాజులు విచ్చేస్తారని తెలిపారు. అధ్యక్షుడు పివి రమణమూర్తి మాట్లాడుతూ ఈఏడాది రూ.23లక్షలు వరకు విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లుగా అందజేస్తామని తెలిపారు. చిన్న తరగతుల వారికి పుస్తకాలు, బ్యాగ్ లు వంటివి పంపిణీ చేస్తామని తెలిపారు. సమావేశంలో కార్యదర్శి వివి నరసింహమూర్తి, బిహెచ్‌కె బాబూజీ, బిహెచ్ సూర్యలక్ష్మి, జివిఎస్ ప్రకాశరావు, చక్రవర్తి , పర్వతాలు. ఎవిఎస్ ప్రకాశరావు, జివిఎన్ రావు పాల్గొన్నారు.

గంజాయి నివారణకు కఠిన చర్యలు

ప్రజాశక్తి-బొబ్బిలి

గంజాయి నివారణకు కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మువ్వల శ్రీనివాసరావు కోరారు. కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత వైసిపి పాలనలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్నారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాలు విచ్చలవిడిగా దొరకడంతో విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు బానిస అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యారంగాన్ని నాశనం చేసే జిఒ 117, 77ను రద్దు చేయాలని, గంజాయి, మాదకద్రవ్యాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

లారీని ఢీకొని డ్రైవర్ మృతి

ప్రజాశక్తి- భోగాపురం



ప్రమాదానికి గురైన లారీ

జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని మరో లారీ ఢకొన్న సంఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం వేకువజామున సుందరపేట జంక్షన్ వద్దనున్న వంతెనపై జరిగింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. విశాఖ జిల్లా సబ్బవరం మండలం ఎరుకు నాయుడుపాలెం గ్రామానికి చెందిన గంగ్రెడ్డి నూకరాజు (36) బిస్కెట్లు లోడుతో శ్రీకాకుళం వెళ్తున్నాడు. ఇంతలో సుందర పేట జంక్షన్ వంతెనపై ప్రమాదానికి గురై ఆగి ఉన్న వారిని వెనుక నుంచి ఢ కొట్టాడు. దీంతో అక్కడికక్కడే నూకరాజు మతి చెందాడు. నూకరాజుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి గురైన లారీ వద్ద ఎటువంటి సూచిక బోర్డులు లేకపోవడంతో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెప్తున్నారు. ప్రమాదానికి గురైన లారీ వద్ద సరైన సూచిక బోర్డు ఏర్పాటు చేసి ఉంటే ఈ ప్రమాదం జరిగి ఉండేది కాదని పలువురు అంటున్నారు.